సాక్షి పార్వతీపురం మన్యం

ఆదివారం । 3 । మార్చి । 2024

I



పేద పిల్లలకు ఉజ్వల భవిష్యత్

పేద పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. - IIలో



తీగ లాగారు.. డొంక కదిలింది

ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు దొంగతనాలకు పాల్పడిన కేసులను శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పోలీసులు ఛేదించారు. - IIలో

5,576 మంది హాజరు

పార్వతీపురంటౌన్: ఇంటర్మీడియట్ పరీక్షలు రెండో రోజు శనివారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి డి. మంజులా వీణ తెలిపారు. సెకెండియర్ లాంగ్వేజ్ సబ్జెక్టు పరీక్షలకు 5,893 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 5,576 మంది హాజరయ్యారని, 317మంది గైర్హాజరయ్యారన్నారు. వృత్తి విద్యాకోర్సులకు 2,907 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 2,622 మంది హాజరయ్యారని, 285 మంది గైర్హాజరైనట్టు వెల్లడించారు. జిల్లాలో 32 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయని తెలిపారు.

‘అగ్నివీర్’కు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి యువత నుంచి ఆర్మీ రిక్రూటింగ్ విశాఖపట్నం కార్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్ పోస్టులకు 10వ తరగతి, అగ్నివీర్ ట్రేడ్‌మన్‌కు 8వ తరగతి ఉత్తీర్ణులైన అవివాహిత పురుష అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఎంపిక పరీక్ష కోసం ఈ నెల 22వ తేదీలోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాయిన్ ఇండియా ఆర్మీ.ఎన్ఐసీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పోలమాంబ హుండీల ఆదాయం రూ.16,90,459



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి చదురుగుడి ఆలయంలోని ఆరు హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. అమ్మవారి మూడో జాతర నుంచి ఆరో జాతర వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.16,90,459 నగదు, 14 గ్రాముల బంగారం, 190 గ్రాముల వెండి వచ్చినట్టు ఈఓ వి.వి సూర్యనారాయణ తెలిపారు. జిల్లా దేవదాయశాఖ అధికారి డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షణలో సాగిన లెక్కింపు కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, మాజీ చైర్మన్ దాలినాయుడు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలో.. సుగర్ ఫ్యాక్టరీ సర్వనాశనం!

- వాస్తవాలను దాచిపెట్టి టీడీపీ నాయకుల దుష్ప్రచారం
- సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో కొత్త నాటకం
- భీమసింగి సుగర్ ఫ్యాక్టరీకి చంద్రబాబు ప్రభుత్వంలో సమాధి
- పరాధీనం చేయాలనే కుట్రతోనే నిర్వీర్యం
- ఫ్యాక్టరీని గట్టెక్కించడానికి వైఎస్సార్, జగన్ ప్రభుత్వాల కృషి



మూతపడిన భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయరామ కోఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీ... నాడు చంద్రబాబు విషకౌగిలిలో చిక్కి సమాధి అయిపోయింది. రైతుల భాగస్వామ్యంతో సహకార రంగంలో ఉన్నా ప్రైవేట్‌పరం చేయాలనే కుట్రతో క్రమక్రమంగా నిర్వీర్యం చేస్తూ వచ్చారు. నాటి ఘోరాలను దాచిపెట్టి ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టేయడానికి టీడీపీ నాయకులు దుష్ప్రచారానికి తెరతీశారు. ఇందుకు పచ్చ మీడియా వంతపాడుతోంది. సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో ఇప్పుడీ నెపం నెట్టేసే కొత్తనాటకం మొదలెట్టారు. వాస్తవానికి ఈ ఫ్యాక్టరీని గట్టెక్కించడానికి నాడు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాలే కృషి చేశాయి. ఈ విషయం రైతులకు తెలుసు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశవ్యాప్తంగా చక్కెర పరిశ్రమ సంక్షోభంలో ఉంది. రైతులు కూడా మొక్కజొన్న, పామాయిల్ తదితర లాభసాటి పంటల వైపు మరలిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఏటా చెరకు సాగు విస్తీర్ణం తగ్గిపోతూ వస్తోంది. సుగర్ ఫ్యాక్టరీల మనుగడ దినదిన గండంగా ఉందనే విషయాన్ని మరుగునపెట్టి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లేందుకు టీడీపీ నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

చంద్రబాబుదే ఆ పాపం...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు తొలిదఫా పాలన సాగిన 1995 నుంచి 2003 వరకూ రాష్ట్రంలోని 18 సహకార చక్కెర కర్మాగారాల్లో ఎనిమిది ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీకి అదేగతి పట్టించేందుకు కత్తి వేలాడదీశారు. 2003–04 సీజన్‌లో క్రషింగ్ చేయకూడదని అప్పటి టీడీపీ ప్రభుత్వమే ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఫ్యాక్టరీ తాత్కాలికంగా మూతపడింది. నాటి ప్రతిపక్ష నేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి తన పాదయాత్రను 2003 ఏప్రిల్‌లో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ ముందుగానే సాగింది. అప్పుడు చెరకు రైతులు ఆయన వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారికి ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఫ్యాక్టరీని తెరిపించారు. ప్రభుత్వ గ్యారెంటీతో రూ.3.50 కోట్ల రుణం అందించారు. ఫ్యాక్టరీకి గుదిబండగా మారిన అప్పులు రూ.18.04 కోట్లను ప్రభుత్వం షేరు ధనంగా మార్చారు. ఆధునికీకరణకు రూ.36.18 కోట్లు మంజూరు చేశారు. తద్వారా క్రషింగ్ సామర్థ్యాన్ని 1205 మెట్రిక్ టన్నుల నుంచి 2 వేల మెట్రిక్ టన్నులకు పెంచడం, పవర్ ప్లాంట్ ఉత్పత్తి కూడా 1.5 కిలోవాట్ల నుంచి 12 కిలోవాట్లకు పెంచడం లక్ష్యాలుగా నిర్దేశించారు. మిగులు విద్యుత్తును ప్రభుత్వానికి విక్రయించడం ద్వారా ఫ్యాక్టరీ కొంత లాభపడటం అనేదీ ఇందులో భాగం. మరోవైపు ఫ్యాక్టరీ ఆధునికీకరణకు తమ వంతు సహకారంగా రైతులు నుంచి రూ.3 కోట్ల వరకూ పెట్టుబడి నిధి కూడా సేకరించారు. దాన్ని బ్యాంకులో డిపాజిట్ చేస్తే అది వడ్డీతో రూ.5 కోట్లు అయ్యింది.

రైతుల పొట్టకొట్టింది టీడీపీ...

భీమసింగి కోఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీ 1976–77 సంవత్సరంలో తొలిసారి క్రషింగ్‌ను ప్రారంభించింది. దీనిలో 16,873 మంది రైతులు షేర్ హోల్డర్స్ కాగా, 3500 మంది నాన్ షేర్ హోల్డర్స్‌గా ఉన్నారు. తొలుత 543 గ్రామాల్లో ఆరు వేల మంది రైతులకు ఉపయోగపడేది. ఆ సమయంలో 8 వేల ఎకరాల్లో చెరకు సాగు చేసేవారు. టీడీపీ పాలనలో జరిగిన తప్పిదాలు, వరుస నష్టాలతో రైతులు చెరకు సాగును క్రమేపీ తగ్గించేశారు. ఇప్పుడీ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో రైతులు 500 ఎకరాలకు మించి చెరకు సాగుచేయట్లేదు.

ప్రమాదకర స్థితిలోకి ఫ్యాక్టరీ...

గత టీడీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా ఫ్యాక్టరీ సుమారు రూ.47.88 కోట్లు నష్టాల్లోకి వెళ్లింది. ఆప్కాబ్ నుంచి తెచ్చిన రూ.25 కోట్ల రుణంపై ఏటా రూ.3.2 కోట్ల వరకూ వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి. మరోవైపు యంత్రాలన్నీ పనిచేయకుండా పోయాయి. గత టీడీపీ ప్రభుత్వం మొసలికన్నీరు కారుస్తూ రూ.12 కోట్లు మంజూరుచేసినట్లు ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా ప్రస్తుతం ప్రమాదకర పరిస్థితిలో ఉంది.

కె.ఎ.నాయుడి ఘనకార్యం...

ఫ్యాక్టరీ కోసం వినియోగించాల్సిన రూ.5 కోట్ల నిధిని దుర్వినియోగం చేయడంలో టీడీపీ నాయకుడు కె.ఎ.నాయుడి ఘనకార్యం ఉంది. 2014 సంవత్సరంలో టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ విషయంలో ఎప్పటిలాగే పాత వైఖరినే మరలా కొనసాగించారు. అప్పట్లో గజపతినగరం ఎమ్మెల్యేగా ఉన్న కె.ఎ.నాయుడు ఫ్యాక్టరీ సర్వసభ్య సమావేశాన్ని తూతూమంత్రంగా నడిపించేవారు. అశోక్ గజపతిరాజైతే ఏనాడూ హాజరైన దాఖలాలు లేవు. ఇదే అదనుగా ఫ్యాక్టరీ ఆధునికీకరణకు బ్యాంకులో ఉన్న రూ.5 కోట్ల నిధిని కె.ఎ.నాయుడు దుర్వినియోగం చేశారు. రైతులు అడగకపోయినా ఆ డిపాజిట్లను పంచేశారు. దీంతో ఆధునికీకరణ ప్రతిపాదనను ఉద్దేశపూర్వకంగానే తెరవెనుకకు పంపించేశారు. కర్మాగారం కమిటీ చైర్మన్‌గా గంట్యాడ మండలానికి చెందిన గుల్లిపల్లి లలితను నియమించినప్పటికీ నెల తిరగకముందే ఆమె పదవికి స్వయంగా టీడీపీ నాయకులే ఎసరుపెట్టారు. వర్గపోరుతో కోర్టుకెళ్లి ఆమె పదవిని రద్దు చేయించారు.

ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి...

ఫ్యాక్టరీపై ఆధారపడిన రైతులకు నష్టం లేకుండా జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ప్రభుత్వంతో చర్చించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఫలితంగా రైతులు గత నాలుగేళ్లుగా రేగిడి మండలం సంకిలి వద్దనున్న ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీకి చెరకును విక్రయిస్తున్నారు.

ఫ్యాక్టరీని ముంచేసిందెవరో రైతులకు తెలుసు...



చెరకు రైతులను మభ్యపెట్టడానికి టీడీపీ నాయకులు మొసలికన్నీరు కార్చుతున్నారు. చంద్రబాబు పాలన ఒక శాపం. 2003 నాటికి భీమసింగి సుగర్ ఫ్యాక్టరీకి మూతవేసేశారు. సీతానగరం మండలంలోనున్న మరో సుగర్ ఫ్యాక్టరీని కమీషన్ల కోసం తక్కువ మొత్తానికే ప్రైవేట్‌పరం చేసేశారు. 2004లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత భీమసింగి ఫ్యాక్టరీకి జీవం పోశారు. లాభాల బాట పట్టించారు. మళ్లీ 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత యథావిధిగా నష్టాల్లో ముంచారు. ఫ్యాక్టరీ అభివృద్ధి కోసం రైతుల వంతుగా సేకరించిన రూ.5 కోట్ల సొమ్మును అప్పటి టీడీపీ ఎమ్మెల్యే కేఏ నాయుడు దుర్వినియోగం చేశారు. చంద్రబాబు కుర్చీ దిగిపోయే నాటికి చెరకు సాగువిస్తీర్ణం నాలుగో వంతుకు పడిపోయింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకూ 9,795 మెట్రిక్ టన్నుల చెరకు ప్యారీకి వెళ్లింది. ఇంకా 600 టన్నుల వరకూ ఉండవచ్చు. ఇంత తక్కువ క్రషింగ్‌తో ఫ్యాక్టరీని నడపడం ఆర్థికంగా మరింత నష్టమే తప్ప లాభంలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో రైతులకు ఉపయోగపడేలా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను అక్కడ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం.

– బొత్స అప్పలనర్సయ్య, గజపతినగరం ఎమ్మెల్యే

వేగవంతంగా భూముల రీ సర్వే

పార్వతీపురం: జిల్లాలో భూముల రీ సర్వే, సరిహద్దు రాళ్ల ఏర్పాటు వేగవంతంగా జరుగుతోందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.జవహర్‌రెడ్డి వివిధ అంశాలపై శనివారం వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ సీతానగరం బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని, ప్రతిపాదనలు పంపించామని, పనులకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ సి.విష్ణుచరణ్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి పాలనే మా అజెండా



కొండతాడూరు రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు గిరిజన ప్రాంతాల్లో చేసిన అభివృద్ధేమిటి?
- ఎన్నికల వేళ మాయమాటలు చెప్పేవారిని నమ్మొద్దు
- మరోసారి జగనన్నను ఆశీర్వదించండి: డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: ప్రజా సంక్షేమం, అభివృద్ధే అజెండాగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, నేడు ప్రతి గిరిజన కుటుంబంలోనూ ‘నవరత్న’ వికాసం స్పష్టంగా కనిపిస్తోందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని రాయిగుడ్డివలస నుంచి భీమన్నదొరవలస వరకు రూ.80లక్షల ఖర్చుతో బీటీ రోడ్డు, మాతుమూరు బీటీ రోడ్డు నుంచి కొండతాడూరు వరకు రూ.కోటి వ్యయంతో బీటీ రోడ్డు, సాలూరు–పాచిపెంట మధ్య బొబ్బిలివలస జంక్షన్ నుంచి బొబ్బిలివలస గ్రామం వరకు రూ.60 లక్షలతో బీటీ రోడ్డు, పి.కోనవలస గురుకుల పాఠశాలలో రూ.కోటి 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న డైనింగ్ హాల్ పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన సమావేశాల్లో రాజన్నదొర మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు గిరిజన ప్రాంతాల్లో చేసిన అభివృద్ధి ఏమైనా ఉందాని గిరిజనులను ప్రశ్నించారు. దీనికి లేదనే సమాధానం వచ్చింది. నాడు గిరిజనుల అభివృద్ధిని కనీసం పట్టించుకోని చంద్రబాబు.. నేడు సిగ్గులేకుండా గిరిజనుల కోసం మాట్లాడుతున్నారని విమర్శించారు. సాలూరు నియోజకవర్గంలో కనీసం ఒక గిరిశిఖర గ్రామానికి కూడా రోడ్డు వేయలేదన్నారు. ఎన్నికల వేళ టీడీపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మొద్దన్నారు. సుమారు ఐదేళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా వివిధ సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధిని గిరిజనుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తోందన్నారు. కోట్లాది రూపాయలతో గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, బ్రిడ్జిలు, తదితర అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. గిరిజనులకు అండగా నిలిచి, గిరిజనాభివృద్ధికి కృషి చేస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని మరలా ఆశీర్వదించాలని కోరారు.


విద్య, ఆరోగ్యానికి పెద్దపీట

ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి విద్య, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. చిన్నపాటి ఆరోగ్య సమస్య తలెత్తినా వెంటనే ఉపాధ్యాయులకు, ఏఎన్‌ఎమ్‌కు తెలపాలని, బిడియంతో ఉండరాదని విద్యార్థులకు సూచించారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న మక్కువ మండలంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిందని తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీపీ బడ్నాన ప్రమీల, వైస్ ఎంపీపీ కొరిపల్లి రవీంద్రనాథ్, శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలు నాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, సర్పంచ్‌లు చింత సీతయ్య, పెద్దింటి గంగమ్మ, దండుపాటిరాము, మాదల సింహాచలం, ఇజ్జాడ అప్పలనాయుడు, దమ్మి సింహాచలం, కొటిస మంగమ్మ, ఎంపీటీసీ సభ్యులు కొల్లి లక్ష్మి, కాదల అన్నపూర్ణ, దోనేరు లచ్చయ్య, మాదల సత్యవతి, దండి ఏడుకొండలు, నాయకులు టి.గౌరీశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

- నేడు జిల్లా వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమం
- 0–5 ఏళ్లలోపు పిల్లలందరికీ చుక్కల మందు
- జిల్లాలో 98,991 మంది చిన్నారుల గుర్తింపు
- మూడు రోజుల పాటు కొనసాగనున్న పల్స్‌పోలియో



పోలియో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు, వైద్య సిబ్బంది

పార్వతీపురంటౌన్:పోలియో మహమ్మారి శాశ్వత నిర్మూలనే లక్ష్యంగా జిల్లాలో మూడు రోజుల పాటు పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లాలోని 37 పీహెచ్‌సీల పరిధిలో శనివారం ర్యాలీలు నిర్వహించారు. ఐదేళ్లలోపు వయస్సు గల పిల్లలందరికీ పోలియో చుక్కలు అందించేందుకు ఆదివారం నుంచి మంగళవారం వరకు పల్స్‌పోలియో కార్యక్రమం కొనసాగనుంది.

శివారు పట్టణాల శివారు కాలనీలు అపార్ట్‌మెంట్లలో పిల్లలకు కూడా చుక్కల మందు వేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. పార్వతీపురం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీలు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలియో కేంద్రాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎం. నారాయణరావు, డీఎంఓ డాక్టర్ పి. జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

లక్ష్యం సాధించేలా..

జిల్లాలో ఐదేళ్లలోపు వయస్సు ఉన్న చిన్నారులు 98,991 మందికి చుక్కల మందు వేసేందుకు 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు యూపీహెచ్‌సీలు, రెండు మున్సిపాల్టీలు, నగర పంచాయతీతో పాటు పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో మొత్తం 980 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వైద్య, స్త్రీ శిశు సంక్షేమశాఖ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సేవలను వినియోగిస్తున్నారు. 2,064మంది అంగన్‌వాడీలు, 1622 మంది ఆశవర్కర్లు, 382 మంది ఏఎన్‌ఎంలను విధులకు కేటాయించారు. ఎక్కడైనా అవాంతరాలు ఎదురైతే వెంటనే పరిష్కరించేందుకు జిల్లాలో 42 మొబైల్ బృందాలను ఏర్పాటు చేశారు.

కేంద్రాలకు చేరుకున్న చుక్కల మందు

6039 వయల్స్ (ఒక వయల్20 వ్యాక్సిన్లు) చుక్కల మందు పార్వతీపురం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయానికి చేరుకుంది. అక్కడ నుంచి పీహెచ్‌సీలకు తరలించారు. అక్కడ నుంచి ఎంపిక చేసిన కేంద్రాలకు ఏ రోజుకారోజు చేరవేసేందుకు 19 రవాణా బృందాలను సిద్ధం చేశారు. మాస్కులు, శానిటైజర్లు, సబ్బులను కూడా డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలోని ఇమ్యూనైజేషన్ విభాగం నుంచి అన్ని పీహెచ్‌సీలకు అందజేశారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం

పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 980 కేంద్రాలను ఏర్పాటు చేశాం. ప్రభుత్వం నుంచి సరిపడా చుక్కల మందు జిల్లాకు చేరుకుంది. అన్ని పీహెచ్‌సీలకు సరఫరా చేశాం. అక్కడ నుంచి ఎంపిక చేసిన కేంద్రాలకు చేర్చేలా చర్యలు చేపట్టాం. 0–5 ఏళ్లలోపు పిల్లలను తల్లిదండ్రులందరూ జాగ్రత్తగా వ్యాక్సినేషన్ కేంద్రాలకు తీసుకువెళ్లి చుక్కల మందును వేయించాలి.

– డాక్టర్. బి.జగన్నాథరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ, పార్వతీపురం మన్యం

కసరత్తు ముమ్మరం

- ఎన్నికల సన్నద్ధతను వేగవంతం చేసిన యంత్రాంగం
- తరచూ సమావేశాలు, శిక్షణ



ఎన్నికల విధులపై సమీక్షిస్తున్న కలెక్టర్

సాక్షి, పార్వతీపురం మన్యం: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. ఇటు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ.. మార్పులు, చేర్పులను ఎప్పటికప్పుడు విశదీకరిస్తూనే.. అటు ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి, అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన చోట సహాయ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. 1031 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తుండగా.. ఇందులో వివిధ అభ్యంతరాల నేపథ్యంలో 244 కేంద్రాల పేర్లు మార్పునకు, 26 కేంద్రాలు లొకేషన్ మార్పునకు ప్రతిపాదనలు పంపుతున్నారు. ఇందులో పాలకొండ నియోజకవర్గంలో 120 కేంద్రాల పేర్లు, 12 లొకేషన్లు ఉన్నాయి. కురుపాంలో 5 పేర్లు, 8 లొకేషన్లు, పార్వతీపురంలో 87 పేర్లు, 2 కేంద్రాలు లొకేషన్లు, సాలూరులో 32 పోలింగ్ కేంద్రాల పేర్లు, నాలుగు కేంద్రాల లొకేషన్ మార్పునకు ప్రతిపాదనలు పంపిస్తున్నారు. ఈ మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ శనివారం సమావేశం నిర్వహించి, వారి అభిప్రాయాలనూ తీసుకున్నారు. మరోవైపు సాధారణ ఎన్నికల శిక్షణ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే తనిఖీ బృందాలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో జప్తు చేసిన డబ్బు, ఇతర వస్తువులకు సంబంధించి ఎన్నికల జప్తు నిర్వహణ సంస్థ(ఈఎస్ఎంఎస్) యాప్ రూపొందించారు. తనిఖీ బృందాల వారు పట్టుకున్న డబ్బును, వస్తువులను కచ్చితంగా ఈ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

టీడీపీ అభ్యర్థికి వ్యతిరేకంగా ర్యాలీ

- కార్యకర్తలతో రహస్యంగా సమావేశమైన కేపీ నాయుడు



ర్యాలీ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

గంట్యాడ: గజపతినగరం టీడీపీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా ఆ పార్టీ కార్యకర్తలు శనివారం ర్యాలీ నిర్వహించారు. గంట్యాడ నుంచి విజయనగరం వరకు ర్యాలీ నిర్వహించారు. కొండపల్లి శ్రీనివాస్‌కు టీడీపీ టికెట్టు ఇవ్వడాన్ని ఆ పార్టీ టికెట్టు ఆశించి భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే కేపీ నాయుడు వర్గం వ్యతిరేకిస్తోంది. ఈ క్రమంలో స్థానిక కేపీఎస్ బీఈడీ కళాశాలలో కేపీ నాయుడు కార్యకర్తలతో రహస్యంగా సమావేశం నిర్వహించారు. గజపతినగరం టికెట్టు విషయంలో పార్టీ అధిష్టానం పునరాలోచించి త్వరలో ఏదో ఒక నిర్ణయం తీసుకుంటుందని కేపీ నాయుడు కార్యకర్తలకు చెప్పినట్టు సమాచారం.

త్రుటిలో తప్పిన ప్రమాదం




చందక పేట జంక్షన్‌లో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న వేరొక లారీ

బొండపల్లి: మండలంలోని చందకపేట గ్రామ సమీపంలో జాతీయ రహదారి 26పై శనివారం వేకువ జామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు లారీలు వెనుక, ముందు భాగాలు నుజ్జయ్యాయి. ప్రమాదానికి సంబంధించి వివరాలు.. విజయనగరం వైపు నుంచి సాలూరు వైపు వెళ్తున్న ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా వస్తున్న వేరొక లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు లారీల్లో ఉన్న డ్రైవర్లు, క్లీనర్లకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: ఫోర్జరీ కేసులో నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శనివారం తెలిపిన వివరాలు... తూర్పుగోదావరి జిల్లాలో జీఆర్‌పీ విభాగంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శ్రీనివాసరావు అనే వ్యక్తికి అంబులెన్స్ శివ పరిచయమయ్యాడు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న హేమంత్‌కుమార్ అనే వ్యక్తి విజయనగరం జిల్లా నుంచి తూర్పు గోదావరి జిల్లాకు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌గా వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తున్నాడని నమ్మించి శ్రీనివాసరావు నుంచి రూ.2.50 లక్షలు తీసుకున్నట్లు సీఐ తెలిపారు. అంతేకాకుండా హేమంత్‌కుమార్‌కు మ్యూచ్‌వల్ ట్రాన్స్‌ఫర్‌గా వెళ్లేందుకు ఆసక్తి లేకపోయినప్పటికీ, అతని పేరున ఒక దరఖాస్తు రాసి, హేమంత్‌కుమార్ సంతకాన్ని అంబులెన్స్ శివ ఫోర్జరీ చేసి, శ్రీనివాసరావుకు అప్పగించాడన్నారు. ఈ మేరకు శ్రీనివాసరావు మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కు ప్రయత్నం చేసి, బదిలీ అయినట్లు ఉన్నతాధికారుల నుంచి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విషయం హేమంత్‌కుమార్‌కు తెలిసి, తాను ఎటువంటి దరఖాస్తు చేయలేదని, ఉన్నతాధికారులకు వివరించారు. దీంతో హేమంత్‌కుమార్ అసలు దరఖాస్తు చేయలేదని తెలుసుకుని శ్రీనివాసరావు అంబులెన్స్ శివపై వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు విచారణలో అంబులెన్స్ శివ... హేమంత్‌కుమార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి, శ్రీనివాసరావును మోసం చేసినట్లు నిర్ధారించుకొని అంబులెన్స్ శివను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వన్‌టౌన్ సీఐ వెంకటరావు తెలిపారు.

ఈఎండీపీ ఎక్స్‌పో రాష్ట్ర పోటీలకు ఎంపికలు పూర్తి



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విజేతలతో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌టీ నాయుడు

విజయనగరం అర్బన్: రాష్ట్ర స్థాయిలో జరిగే ఎంట్రప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ) ఎక్స్‌పో పోటీలకు జిల్లా నుంచి పాల్గొనే ప్రాజెక్టుల ఎంపిక పూర్తయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ, ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్, అప్లటూన్ ఇంటర్నేషనల్ సంయుక్త సహకారంతో స్థానిక కంటోన్మెంట్ ఉన్నత పాఠశాలలో శనివారం చేపట్టిన ఈ పోటీలలో జిల్లా వ్యాప్తంగా 12 పాఠశాలల నుంచి విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను పోటీ ప్రదర్శనకు ఉంచారు. పోటీలను ప్రారంభించిన జిల్లా డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.తిరుపతినాయుడు మాట్లాడుతూ పరిశోధనా దృక్పథం విద్యార్థుల్లో పాఠశాల స్థాయి నుంచి రావాలని అన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులు బోధనలు ఉండాలని సూచించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

పేద పిల్లలకు ఉజ్వల భవిష్యత్

- కేరళను మించి ఏపీలో విద్యా వ్యవస్థ
- రాష్ట్రంలోనే తొలి ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎంపీ బెల్లాన



ల్యాబ్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎస్ఎస్ఏ ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావు, ఇంటెల్ సంస్థ డైరెక్టర్ శ్వేతఖురానా తదితరులు

చీపురుపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేద పిల్లలకు ఉజ్వల భవిష్యత్ అందించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం – ప్రైవేటు విధానంలో ప్రముఖ దిగ్గజ సంస్థ ఇంటెల్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ స్కిల్ ల్యాబ్‌ను రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ స్కిల్ ల్యాబ్ లక్ష్యాలను అక్కడున్న ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవస్థలో కృత్రిమ మేధో సంపత్తు ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచి కృత్రిమ మేధో సంపదను అభివృద్ధి చేసుకునేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రముఖ దిగ్గజ సంస్థ ఇంటెల్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకుని రూ.లక్షల వ్యయంతో ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోనే తొలి ల్యాబ్‌ను చీపురుపల్లిలో ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు కారణంగా ఏపీలో విద్య కేరళను మించిపోయిందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా బాలుర ఉన్నత పాఠశాలకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పాఠశాలను ఆధునీకరించుకోనున్నట్లు చెప్పారు.

విద్యా వ్యవస్థకు సీఎం తొలి ప్రాధాన్యత

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని, పేద పిల్లలు భవిష్యత్‌పై సీఎంకు ప్రత్యేక శ్రద్ధ ఉందని రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావు చెప్పారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వద్ద కూడా లేని ట్యాబ్‌లు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు దగ్గర ఉన్నాయన్నారు. ఆ ట్యాబ్‌ల్లో ఉన్న బైజూస్ కంటెంట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిత్యం జీవితంలో ఎదురయ్యే సమస్యలకు సమాధానాలను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్‌ల్లో ప్రాజెక్టులు ద్వారా తయారు చేయాలన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణానికి రూ.5 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంటెల్ ఇండియా సంస్థ డైరెక్టర్ శ్వేతఖురానా, డీఈఓ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కరణపు బాలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ఇప్పిలి గోవింద, పతివాడ రాజారావు, గిరడ రాందాసు, సువ్వాడ అప్పలనాయుడు, కరణపు ఆది, దాలయ్య, ఎంఈఓ బూసినాయుడు, హెచ్‌ఎం చంద్రశేఖర్‌కుమార్ పాల్గొన్నారు.

సీతంలో ‘యూత్ పార్లమెంట్’



మోడల్ పార్లమెంట్ సమావేశంలో విద్యార్థులు

విజయనగరం అర్బన్: జిల్లా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని బాలల హక్కుల చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి కె.ఉజ్వల్, మెడికల్ కౌన్సెలర్ త్రినాధరావు, జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ, సెట్విజ్ సీఈఓ రామగోపాలరావు, సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

- తన అన్నయ్య వివాహ ఆహ్వాన కార్డులు పంచేందుకు వెళ్తుండగా ఘటన



సత్యనారాయణ(ఫైల్)

సబ్బవరం: అనకాపల్లి–ఆనందపురం హైవేపై ఇరువాడ సమీపంలో బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విజయనగరం జిల్లా బొబ్బిలి సమీపంలోని కోమటిపల్లికి చెందిన సింగరాతి సత్యనారాయణ(23) తన అన్నయ్య ఈశ్వరరావుతో కలిసి దువ్వాడ సమీపంలోని ఓ కేటరింగ్ సర్వీస్‌లో కుక్‌గా పనిచేస్తున్నారు. ఈశ్వరరావుకు ఈ నెల 27న వివాహం నిశ్చయమైంది. దీంతో వీరిద్దరూ శుక్రవారం రాత్రి అనకాపల్లిలోని స్నేహితుడికి పెళ్లి కార్డు ఇవ్వడానికి వెళ్లి.. రాత్రి అక్కడే బస చేశారు. వివాహ కార్డులు పంచేందుకు శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో సత్యనారాయణ ఒక్కడే బైక్‌పై తన స్వగ్రామం బయలుదేరాడు. సర్వీస్ రోడ్డులో అనకాపల్లి నుంచి పెందుర్తి వైపు వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న క్వారీ లారీ బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై నుంచి అతను పడిపోగా.. అదే సమయంలో వెనకనే వస్తున్న డంపర్ లారీ అతనిపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి తండ్రి సింహాచలం, తల్లి పద్మ, సోదరి దాలమ్మ ఉన్నారు. సోదరుడు ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు సబ్బవరం సీఐ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. రమామోహిని తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఐదు, ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఐదో తరగతిలో ప్రవేశానికి రూ.100, ఇంటర్ ప్రవేశానికి రూ.250 ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి, ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదో తరగతి అభ్యర్థులకు వచ్చే నెల 27న, ఇంటర్ అభ్యర్థులకు వచ్చే నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

మోడల్‌స్కూల్‌లో..

విజయనగరం ఫూల్‌బాగ్: ఫూల్‌బాగ్ ప్రాంతంలోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రుక్సానా పర్వీన్ తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ, ఈనెల 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75 పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు.

కొటియా గ్రామాలను సందర్శించిన ఎస్పీ పాటిల్



నేరడివలసలో పర్యటిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొటియా గ్రూపు గ్రామాలు ఎగువ శంబి, దిగువ శంబి, కొటియా, జోలిఅంబ, పట్టు చెన్నూరు, పగులు చెన్నూరు, మడకారు గ్రామాల్లో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం పర్యటించారు. ఎన్నికల్లో నెలకొంటున్న సమస్యలపై ఆరా తీశారు.

కొటియాలో 21 గ్రామాలపై హక్కుకోసం ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలు దశాబ్దాలుగా సుప్రీంకోర్టులో పోరాటం చేస్తున్నాయి. రెండు రాష్ట్రాలకు ఒకేసారి సార్వత్రిక ఎన్నికలు వస్తున్నప్పటికీ పోలింగ్ వేర్వేరు తేదీల్లో ఉండేలా అధికారులు చూసుకుంటున్నారు. ఇక్కడ ప్రజలు రెండు రాష్ట్రాలకూ ఓటు వేస్తారు. ఇబ్బందులు రాకుండా ఉండడానికి పోలీంగ్ అధికారులు ఒక రాష్ట్రానికి సంబంధించి ఒకవేలికి, మరో రాష్ట్రానికి సంబంధించి మరో వేలికి సిరా చుక్కను పెడతారు. దీంతో ఇంతవరకు సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మరో విచిత్రం ఏమిటంటే ఈ గ్రామాలకు ఐరుప్రాష్ట్రాల రేషన్ కార్డులు, పింఛన్లు, అంగన్వాడీ, అంగన్‌వాడీ కార్డులు ఉన్నాయి.

తీగ లాగారు.. డొంక కదిలింది



మాట్లాడుతున్న శ్రీకాకుళం ఎస్పీ రాధిక, రికవరీ చేసిన సామగ్రి

- 7 కేసుల్లో 21 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- ఒడిశాకు చెందిన ఇద్దరు అరెస్టు
- ఎస్పీ జీఆర్ రాధిక ప్రకటన

నరసన్నపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు దొంగతనాలకు పాల్పడిన కేసులను నరసన్నపేట పోలీసులు ఛేదించారు. నరసన్నపేట శ్రీరామ నగర్–3లో జామి వరలక్ష్మి అనే మహిళ మెడలో నుంచి గత నెలలో బంగారు ఆభరణం ఎత్తుకెళ్లారు. దీనిపై నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు నిర్వహించిన పోలీసులు మరో ఆరు కేసుల్లో నిందితులుగా ఉన్న ఒడిశాకు చెందిన వ్యక్తులు శిబ శంకర్ మహంతి, సురేష్ పాడిలను అరెస్టు చేశారు. వీరి వద్ద 7 కేసులకు సంబంధించి 21 తులాల ముప్పావు బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ జీఆర్ రాధిక నరసన్నపేట సీఐ కార్యాలయంలో శనివారం సాయంత్రం వివరాలు వెల్లడించారు. పార్వతీపురం పీఎస్‌లో రెండు, విజయనగరం టూ టౌన్‌లో రెండు, విశాఖ సిటీ పీఎం పాలెం, విశాఖ త్రీ టౌన్, నరసన్నపేట పోలీసు స్టేషన్లలో నమోదైన చోరీ, చైన్ స్నాచింగ్ కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారని పేర్కొన్నారు. నరసన్నపేటలో లభించిన ఆధారాలతో దర్యాప్తు చేయగా పాత కేసుల విషయాలు తెలిశాయని, ఆ సొత్తును కూడా రికవరీ చేశామని ఆమె వెల్లడించారు. వీరు చైన్ స్నాచింగ్ చేస్తూ పోలీసుల నుంచి తప్పించుకునేందుకు బైక్ నంబర్ ప్లేట్లు మారుస్తూ వచ్చారని వివరించారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలు విక్రయించకుండా కరిగిస్తున్నారని, దీనికి సంబంధించిన సామగ్రి కూడా రికవరీ చేశామని చెప్పారు. వీరి వద్ద నుంచి రెండు చాకులు, ఒక నాటు తుపాకీతో పాటు వారు వాడిన నంబరు ప్లేట్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నరసన్నపేట జమ్ము కూడలి వద్ద వీరిని అరెస్టు చేశామన్నారు. శిబ శంకర్‌ది బరంపురంలో కృష్ణంపేట వీధి అని, సురేష్ పాడిది అదే పట్టణంలోని లక్ష్మీనరసింగవీధి గా గుర్తించామని పోలీసులు తెలిపారు ప్రెస్ మీట్ లో అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్, టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావు, ఎస్‌ఐ అశోక్‌బాబులు ఉన్నారు.

5లోగా ఈ -క్రాప్ సవరణకు అభ్యంతరాలు తెలియజేయాలి

పార్వతీపురం టౌన్: ఈ – క్రాప్ సవరణకు ఈ నెల 5లోగా అభ్యంతరాలు తెలియజేయాలని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ శనివారం తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రబీ 2023 – 24లో 31,638 ఎకరాలలో సాగు, ఈ–పంట నమోదు పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో ఈ నెల ఒకటో తేదీ నుంచి మూడు వరకు ఈ పంట ముసాయిదా జాబితాను ప్రదర్శించడం జరిగిందని పేర్కొన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా జిల్లాలో అన్ని రైతు భరోసా కేంద్రాలలో రబీ 2023 –24 నకు సంబంధించి ఈ పంట ముసాయిదా జాబితా సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించనున్నట్టు తెలిపారు. మార్పులు అనంతరం తుది జాబితాలను ఈ నెల 8న రైతుభరోసా కేంద్రాలలో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. రైతులంతా తమ పరిధిలో గల రైతు భరోసా కేంద్ర పరిధిలో వున్న సామాజిక తనిఖీల్లో ప్రదర్శించిన ముసాయిదా జాబితాను చూసి సాగు చేసిన పంట నమోదులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సవరణకు రైతు భరోసా కేంద్రంలో వున్న వీఏఏ, వీహెచ్‌ఏ, ఏఎస్‌ఏలను ఈ నెల 5లోగా సంప్రదించి అభ్యంతరాలు రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై కేసులు

విజయనగరం ఫోర్ట్: ఉమ్మడి విజయనగరం జిల్లాలో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై దాడులు చేసి 107 కేసులు నమోదు చేసినట్టు విద్యుత్ విజిలెన్స్ సి.ఐ కె.కృష్ణ శనివారం తెలిపారు. చౌర్యం చేస్తున్న నిందితులు నుంచి రూ.8.50 లక్షల అపరాధ రుసుం, జరిమాన కింద రూ.92 వేలు వసూలు చేసినట్టు చెప్పారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్టయితే 08922–234579 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

చీపురుపల్లి: పట్టణంలో రైల్వేస్టేషన్ నుంచి గరివిడి మధ్య రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ చక్రధర్ శనివారం తెలిపారు. మృతురాలి వయస్సు 70 సంవత్సరాలు ఉంటుందని, కుంకుమ రంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించి ఉన్నట్లు ఆయన తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9618017943 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గిరిజనులకు అండగా నిలుస్తాం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

- ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఏఎస్పీ సునీల్‌షరోన్
- కూనేరులో మెగా వైద్య శిబిరం ఏర్పాటు
- 500 మంది గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు
- ఉచితంగా మందులు అందజేత
- గిరిజన యువతకు వాల్‌బాల్ కిట్లు, వృద్ధులకు గొడుగుల పంపిణీ



యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎస్పీ

కొమరాడ: గిరిజనులకు విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని, ఆర్థికోన్నతి కోసం సంక్షేమ పథకాలు అందజేస్తోమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. మండలంలోని కూనేరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో తిరుమల, మెడికవర్ ఆస్పత్రుల వైద్యులతో కలిసి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు.అనంతరం గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు, వృద్ధులకు చీరలు, గొడులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గిరిజనులు రేయింబవళ్లు కష్టపడుతూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దీనివల్ల కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఊరూరా నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆయుష్షును పెంచుకోవాలని సూచించారు. శిబిరంలో కార్డియాలజీ, గైనకాలజిస్టుతో పాటు జనరల్, కంటి వైద్య నిపుణుల కూడిన బృందం వైద్యసేవలు అందించింది. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ సునీల్‌షరోన్, కొమరాడ, కూనేరు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో పాటు పార్వతీపురం రూరల్ సీఐ కె.రవికుమార్, రూరల్ ఎస్ఐ పి.దినకర్, ఎస్ఐ కె.నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.